క్లుప్తంగా

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ 74వ వసంతంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యూనియన్ సాధించిన విజయాలను గుర్తుచేసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అందరం ఐక్యంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, కిరణ్‌కుమార్, రాంబాబు, ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులకు మరమ్మతులు



బీసీ కాలనీలో మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట కాలనీ ప్రజలకు మంచినీటి సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. ఈ మేరకు లచ్చయ్యపేట బీసీ కాలనీలో పైప్‌లైన్ వేసినా శిథిల మై నీరు సరఫరాక పోవడంతో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. గ్రామానికి, ఎస్సీ కాలనీకి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటి కుళాయిలు వేసి తాగునీరు సరఫరా జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం బీసీ కాలనీ ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు సర్పంచ్ వి.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో కార్యదర్శి సంతోష్‌కుమార్ పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టారు.

పాఠశాలపై విచారణ చేపట్టాలి



ఎంఈవో శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మక్కువ: స్థానిక విశ్వభారతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తీరుపై, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, వారి సమక్షంలో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ సహాయ జిల్లా కార్యదర్శి ఎం.హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖకార్యాలయంలో శుక్రవారం ఎంఈవో శ్యామ్‌సుందర్‌ను ఏఐఎస్ఎఫ్ నాయుకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం తీరుపై ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులను కలిసి, వినతిపత్రాలు అందించామన్నారు. పాఠశాల నిర్వహణపై ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి విచారణ చేపట్టాలని, లేని ఎడల చలో డీఈవో కార్యాలయానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యను ప్రభుత్వమే నిర్వహించాలి

సాలూరు: వైద్యవిద్య కళాశాలలను ప్రైవేటీకరించకుండా ప్రభుత్వమే నిర్వహించాలని రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప ప్రకాశరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటుచేస్తే, ఈ కూటమి ప్రభుత్వంలో పీపీపీ విధానంలో వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ చేతుల్లో నడుస్తున్న యూనివర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్ సౌకర్యం లేకపోవడం వల్ల ఆ కళాశాలలు సీట్లను కోట్లాది రుపాయలకు అమ్ముకుంటున్నాయని ఆరోపించారు.

పారిశుద్ధ్య పనులు మెరుగ్గా జరిపించాలి



సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

మక్కువ: వర్షాకాలం కావడంతో సీజనల్‌వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా జరిపించాలని ఎంపీడీవో డీడీ స్వరూపారాణి కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి, 31 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరిపించాలని చెప్పారు. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ జరిపించాలన్నారు. ఇంటింటి చెత్తసేకరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎన్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

- పెరిగిపోతున్న నిత్యావసరాలు
- ఏ కూర కొనాలన్నా కేజీ రూ.40 పై మాటే
- సామాన్యుడికి అందనంత ఎత్తులో పప్పుదినుసులు



మార్కెట్‌లో కూరగాయలు

ధరాభారం





పప్పు దినుసులు

పార్వతీపురం రూరల్: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సంచులతో డబ్బులు తీసుకువెళ్తే కవర్‌లో నిత్యావసర వస్తువులను ఇంటికి తీసుకువచ్చే పరిస్థితి నెలకొంది. గడచిన 15రోజుల నుంచి కూరగాయల ధరలు రోజుకోలా ఉంటూ సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. పెరిగిన ధరలతో కూరగాయలు కొనలేక సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి కూరగాయ కేజీ రూ.40 నుంచి రూ.60ల వరకు మార్కెట్‌లో పలుకుతోంది. మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌కు ఇప్పుడున్న ధరలతో ముందుకెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఏటా వేసవిలో కూరగాయల ధరలు పెరుగుతూ వర్షాలు ప్రారంభం కాగానే తగ్గుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అన్ని రకాల కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పప్పు దినుసల ధరలైతే సామాన్యులు, మధ్యతరగతి వారికి అందనంత ఎత్తులో దర్శనమిస్తున్నాయి.

పప్పన్నం కరువాయె..!

కూరగాయల ధరలతో పాటు పప్పు దినుసుల ధరలు కూడా పెరగడంతో సామాన్యుడికి పప్పన్నం కూడా తినేందుకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం చౌకధరల దుకాణం ద్వారా కందిపప్పు సరఫరాను కొన్ని నెలలుగా నిలిపివేయడంతో బహిరంగ మార్కెట్‌లో పప్పుధరలు ఆకాశాన్ని తాకడంతో ప్రజలు పప్పు దినుసుల వాడకానికి ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. కందిపప్పుతోపాటు మినపపప్పు, పెసరపప్పుల ధరలు కొన్ని నెలలుగా రిటైల్ మార్కెట్‌లో గణనీయంగా పెరుగుదలను నమోదు చేసుకోగా ఇవి సామాన్యుల బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

ప్రస్తుత ధరలు మార్కెట్‌లో ఇలా..	
పేరు	ధర (కేజీ రూ.లలో)
టమాటా	45-50
వంకాయలు	40
బీరకాయలు	50
దొండకాయలు	60
కాకరకాయలు	40
చిక్కుడు(పాడవు)	40
మునగ కాడలు	80
క్యారెట్	50
పచ్చిమిర్చి	100
అల్లం	70
వెల్లుల్లి	100
బీట్‌రూట్	50
కందిపప్పు	125
కందిపప్పు రెండోరకం	100
పెసరపప్పు	120
పెసరపప్పు రెండో రకం	110
మినప పప్పు	125
మినప పప్పు రెండోరకం	105
శనగ పప్పు	80
శనగ పప్పు రెండో రకం	76

ఏవీ కొనలేకపోతున్నాం



విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసరాల ధరలు చూస్తుంటే బతుకు భారమవుతోంది. కొద్ది నెలలుగా ధరల పెరుగుదలే తప్ప తగ్గడం కన్పించడం లేదు. మార్కెట్‌కు రూ.1000లు పట్టుకుని వెళ్లినా కావాల్సిన కూరగాయలు, పప్పులు, నిత్యావసర కూరలు కొనలేకపోతున్నాం. కూరగాయల ధరలే ఆకాశంలో ఉంటే వాటిలో వేసే వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి ధరలు రూ.100కు పైగానే పలుకుతున్నాయి. ఇదే ధరలు ఉన్నా లేదా ఇంకా పెరిగినా సామాన్యులు గాని, మధ్యతరగతి వారు కూరలు వండుకోలేని పరిస్థితులు దాపురిస్తాయి.

– యు.అప్పలనాయుడు, కొత్తపట్నం, పార్వతీపురం

ప్రభుత్వం పట్టించుకోదా..?



నిత్యం నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోంది. మా ఇంటి అవసరాలకు వారానికి సరిపడా కూరగాయలు ఒకేసారి తీసుకుంటాం. ఇప్పుడు పెరిగిన ధరల కారణంగా దాదాపు వెయ్యిరూపాయల అదనపు భారం పడుతోంది. ఇది సామాన్యులకు ఎంతోభారం. కొద్ది నెలలుగా రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు ఇచ్చే సరఫరాను కూడా ప్రభుత్వం చేయడం లేదు. పెరిగిన ధరలకు హద్దు కూడా లేదు. ఇలా అయితే ఏ విధంగా కుటుంబంతో జీవనం సాగించాలో అర్థం కావడం లేదు.

– సీహెచ్ శైలజ, పార్వతీపురం పట్టణం

గర్భిణుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం



గర్భిణీ వైద్యపరీక్షల రికార్డును పరిశీలిస్తున్న డాక్టర్ పి.ఉషారాణి

సీతానగరం: మండలంలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులపై దృష్టి సారించాలని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ గర్భిణుల్లో ఎక్కువ మందికి రక్తహీనత (హిమోగ్లోబిన్) ఉన్నట్లు గుర్తించామన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ సుక్రోజ్ మందులు ఇవ్వనున్నామని, ఐరన్ లోపాన్ని అధిగమించడానికి ఐసీడీఎస్ శాఖ అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పాలు, గుడ్లు, చక్కీలు విధిగా తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి నెలా పీహెచ్‌సీల్లో గర్భిణులకు తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవ సమయానికి గర్భిణులందరూ చేరాలని కోరారు. అలాగే సీజనల్ వ్యాధులు వస్తున్న కారణంగా వైద్యసిబ్బంది అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియ జేశారు. పీహెచ్‌సీ ఓపీలో రోజుకు 65 నుంచి 80 మంది రోగులకు సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు బకాయి జీతాలు చెల్లించాలి

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం పంచాయతీ క్లాప్ మిత్రలకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని క్లాప్‌మిత్రల సంక్షేమ సంఘం మండల ప్రతినిధి ఆర్.నారాయణ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజూ తెల్లవారే సమయానికి ఇళ్లవద్దకు వెళ్లి చెత్తను సేకరించిన వారికష్టాన్ని చూసిన ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా తమ సమస్యలు పట్టించుకోలేదని వాపోయారు. మండలంలోని 35 పంచాయతీల్లోనూ క్లాప్‌మిత్రల జీవనోపాధికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినా పంచాయతీల్లో నిధుల కొరత ఉన్నందున్న జీతాలు ఇవ్వలేకపోతున్నామని స్థానిక అధికారుల నుంచి సమాధానం వస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటూనే పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వీఆర్ఎస్ కాలువ పనుల పరిశీలన

సీతానగరం: వెంగళరాయసాగర్ సాగునీటి ప్రాజెక్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేసి ఖరీఫ్‌సీజన్‌కు సాగునీరందించాలని ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర అన్నారు. ఈ మేరకు రామవరం, లచ్చయ్యపేట గ్రామాల మధ్య జరుగుతున్న వెంగళరాయ సాగర్ కాలువ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర కాలువల్లో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్‌కు శివారు భూములకు సాగునీరు అందించడానికి అవసరమైన పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ పి. రామారావు మాట్లాడుతూ వీఆర్ఎస్ 19 ఎల్, 18 ఎల్ కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి ఖరీఫ్ సీజన్‌కు సాగునీరందించడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయకట్టు సంఘం చైర్మన్ వి.సన్యాసినాయుడు, రామవరం సర్పంచ్ పి.సత్యంనాయుడు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, మాజీ సర్పంచ్‌లు గుంపస్వామి, టి. చంద్రశేఖర్, శ్రీరాములు, టి. వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పార్వతీపురం టౌన్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఆరోగ్య కార్యాలయం నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యసిబ్బందితో కలిసి జిల్లా ఆస్పత్రి వరకు అవగాహన నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జననం, ఆరోగ్యవంతమైన భవిష్యత్ లక్ష్యంగా ఈ సంవత్సరానికి గాను ప్రధాన సారాంశంగా ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం ఉండాలనే థీమ్‌పై, తల్లి కావడానికి సరైన వయస్సు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని అందువల్ల పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, కుటుంబ వ్యవస్థను సరిగా నడిపే సమర్థత,ఆలోచనా పరిణితి ఉంటాయన్నారు. అలాగే కాన్పు, కాన్పుకు ఎడం ఉండాలని ఇందుకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డీపీఎంఓ డా.రఘు కుమార్, పీపీయూనిట్ వైద్యాధికారులు డాక్టర్ వై.విజయ్ మోహన్, డా.లావణ్య, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ కౌశిక్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డా. రవిచంద్ర, డా.గణేష్, డీపీఓ లీలారాణి, డెమో సన్యాసిరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పుష్ప, ఇందిర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం



ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు

సాలూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు పట్టణంలోని 1,29 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ –అబద్ధాలు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేస్తోందో గడపగడపకు వెళ్లి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు,ఆడబిడ్డ నిధి, నిరుద్యోగభృతి తదితర సూపర్‌సిక్స్ పథకాల హామీలు అమలు చేయకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు గిరిరఘు, రౌతు అప్పారావు, గొర్లె వెంకటరమణ, రంగా, చిన్ని, హరిబాలాజీ, రామకృష్ణ, లక్ష్మణరావు, రామారావు, వాసు , వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పలగర పాఠశాలకు పిల్లలను పంపండి



గుడివాడ కాలనీ పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: మండలకేంద్రంలోని గుడివాడ కాలనీ పాఠశాలలో గల 3,4,5తరగతుల విద్యార్థుల పేర్లను పలగర మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేసినందున మీ పిల్లలను అక్కడికి పంపించాలని ఎంఈఓ-1సామల సింహాచలం విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. గుడివాడ కాలనీ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ మేరకు శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ పాఠశాలలో 3,4,5తరగతులను పంచాయతీ పరిధిలో ఉండే ప్రధాన పాఠశాలలో విలీనం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు వంతున కేటాయింపు జరిగిందని, విద్యార్థులకు మంచి విద్య అందించే అవకాశాలున్నాయన్నారు. పలగర పాఠశాలకు విద్యార్థులకు పంపించేందుకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ఏడాదికి ఆరువేల రూపాయలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారిని అక్కడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు



పాపమ్మవలసలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు పారిశుధ్య పనులు చేపట్టడానికి ప్రాధాన్యం ఇచ్చామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు జోగింపేట సచివాలయం పరిధిలో ఉన్న పాపమ్మవలసలో శుక్రవారం జరుగుతున్న పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా పనులను డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, సర్పంచ్ ఎం.గౌరునాయుడులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. కురుస్తున్న వర్షాలకు వీధుల్లో, కాలువల్లో చెత్త పేరుకు పోవడంవల్ల దోమలకు నిలయంగా ఉంటోందన్నారు. ఈ నేపథ్యంలో క్లాప్ మిత్రల సహాయంతో వీధుల్లో ఇంటింటికీ వస్తున్న తొట్టితో ట్రై సైకిళ్లకు చెత్త వేయాలని చెప్పారు. సేకరించిన చెత్తను దూరప్రాంతాలకు తరలించాలని సూచించారు. అలాగే వాటర్ ట్యాంక్, బోర్ల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించి క్లోరినేషన్ చేసి శుద్ధిచేసిన నీటిని ప్రజలకు సరఫరా చేయాలని కోరారు.

నియామకాల్లో పారదర్శకత కనిపించాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ ద్వారా త్వరలో చేపట్టనున్న నియామకాల్లో పారదర్శకత కనిపించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పార్వతీపురం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన నియామకాల్లో పలు అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈసారి నియామకాల్లో పారదర్శకత పాటించాలని కోరారు. ఈ సారి గతంలో లాగా నియామకాల్లో ఆరోపణలు రాకూడదని, నియామకాలు రద్దు చేసే దుస్థితి అస్సలు రాకూడదన్నారు. ఇప్పటికే ఆశ కార్యకర్తల నియామకాలకు సంబంధించి గ్రామాల్లో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని, దళారులు రంగ ప్రవేశం చేసి ఆశ కార్యకర్తల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.2 లక్షల వరకు బేరసారాలు ఆడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అక్కడక్కడ వసూళ్లు కూడా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆయా ఆరోపణల్లో వైద్య సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు లేకుండా శాఖాపరమైన హెచ్చరికలు జారీ చేయాలని కోరారు. నిబంధనల ప్రకారమే ఆశ కార్యకర్తలను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పక్షోత్సవాలకు సిద్ధం కావాలి

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శులు సమాయత్తం కావాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 16 నుంచి 30వ తేదీవరకూ గ్రామాల్లో పారిశుధ్య పక్షోత్సవాల నిర్వహణకు తీసుకోవలసిన అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులతో పాటు ప్రత్యేకించి 16వ తేదీనుంచి 30 వరకూ అన్నిగ్రామాల్లో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారిశుధ్య పక్షోత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు పంచాయతీల వారీగా జరుగుతున్న పనులను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కుమావర్మ పాల్గొన్నారు.

మండల సమావేశంలో వాగ్వాదం



అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్



సభ్యుల మధ్య జరుగుతున్న వాగ్వాదం

- ప్రభుత్వ పనితీరును ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- సమావేశంలో అధికారుల నిలదీత

బలిజిపేట: ప్రభుత్వ పనితీరు, వైఫల్యాలు, ప్రజలను నమ్మించి మోసపూరితంగా వ్యవహరించడంపై మండల సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీ సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహించారు. ఈ మేరకు బలిజిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైనా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంపై సభ్యులు తీవ్రస్థాయిలో ఆగ్రహించారు. గత ప్రభుత్వం హయాంలో యూరియా దొరకలేదంటూ రైతు రోడ్డుపైకి రాలేదన్నారు. ఇప్పుడు మాత్రం రైతు సేవా కేంద్రాల వద్ద ధర్నాలు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని వాపోయారు. అన్నదాత సుఖీభవ పథకం అడ్రస్ లేదన్నారు. ఇదేనా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం అని ధ్వజమెత్తారు. యూరియా బస్తాలు అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి వెళ్తున్నాయి తప్ప సామాన్య రైతులకు అందడం లేదన్నారు. ఇదేనా ప్రభుత్వ పనితీరంటూ ప్రశ్నించారు. సాగునీరు అందుబాటులో లేదని, అదేవిధంగా భర్తలు చనిపోయిన వారి భార్యలకు పింఛన్లు 144మంజూరయినప్పటికీ వాటిని నేటికీ పంపిణీ చేయకపోవడంతో ఆ డబ్బులు తిరిగి వెళ్లిపోవడంపై జెడ్పీటీసీ రవికుమార్ ప్రశ్నించగా అధికారులు నీళ్లు నమిలారు. వితంతువులకు ప్రభుత్వం చేసే న్యాయం ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు.

కొంతమంది అధికారుల గైర్హాజరు

ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యాలను సభ్యులు తీవ్రస్థాయిలో ఎండగట్టారు. దీనిపై సభలో ఉన్న టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సభ్యులతో వాగ్వావాదానికి దిగుతూ ప్రభుత్వ వైఫల్యం లేదన్నారు. ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహించారు. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు. వివిధ శాఖలపై రివ్యూ జరుగుతున్నప్పుడు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోవడంతో విసుగుచెందారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, బి.హేమలత, ఎంపీడీఓ నగేష్, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటనలకే మంత్రి పరిమితం

సాలూరు: గిరిజన సంక్షేమ, స్త్రీశిసుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన గ్రామాల్లో డోలీల మోత లేకుండా చేస్తామన్న ప్రకటనలకే పరిమితమయ్యారు తప్ప సమస్య పరిష్కారానికి చొరవ ఎక్కడా చూపలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలో మాట్లాడుతూ, ఇటీవల కురుకుటి పంచాయతీ ఎగువ కాశాయవలస గ్రామానికి చెందిన కోనేటి సామాలమ్మ అనే ఆశవర్కర్ ఆరోగ్యం బాగోలేక డోలీకట్టి సుమారు 5 కి.మీ కాలిబాటన తీసుకువస్తే బాధ్యత గల స్థానంలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి బాధ్యతా తారాహిత్యంగా హేళనగా మాట్లాడడం సరికాదన్నారు. కనీసం రోడ్డు సదుపాయాలు లేని ప్రాంతాల నుంచి రోగులను డోలీలతో కాకుండా మరే విధంగా తీసుకురావాలో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎక్కువగా నాన్‌షెడ్యూల్ గ్రామాలున్నాయని వాటిని షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలి. ఆంధ్రా ఒడిశా కొటియా గ్రూప్ గ్రామాల సమస్య పరిష్కరించాలి. అక్కడి గిరిజనులపై ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యం చేస్తుంటే ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోకుండా మౌనంగా ఉంటోంది. అక్కడ గిరిజనులకు రక్షణ కల్పించాలి. సాలూరు ,పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నిర్మాణం పూర్తిచేయాలి. అటవీ అన్‌సర్వే బంజరుభూములు సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని ఎడల గిరిజనులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.